

19 వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఏలూరు జిల్లా పశ్చిమ గోదావరి జిల్లా

మంగళవారం,10 ఫిబ్రవరి 2026

8 పేజీలు


# జాతర ముగిసింది - సంతోషం మిగిలింది

- వంద రోజులకు పైగా సాగిన జాతర - కలిసొచ్చిన ఉమ్మడి ప్రణాళిక
- ముగింపుగా తంగేళ్లమూడి జాతర : ఎమ్మెల్యే చంటి హర్షం







**ఏలూరు,సూర్య ప్రతినిధి :** వంద రోజులకు పైగా ఏలూరులో సాగిన గంగానమ్మ జాతర సోమవారంతో వైభవంగా ముగిసింది. ఏడేళ్లకు ఓసారి జరిగే గంగానమ్మ జాతరను ఈసారి భక్తి శ్రద్ధలతో కోలాహలంగా నిర్వహించారు. తూర్పు వీధి, పడమర వీధి, దక్షిణపు వీధి, పవర్ పేట, ఆదివారపు పేట, లక్ష్మీవారపు పేట,తంగేళ్లమూడిలలో గంగానమ్మ జాతర దసరా ముగిసిన అనంతరం ఆరంభమైంది. ఈనెల9వతేదీ సోమవారంతో ముగిసింది. అప్పటినుంచి సుదీర్ఘంగా సాగిన జాతరలో వేలాది మంది భక్తులు పాలుపంచుకున్నారు. ప్రత్యేకించి ఏడేళ్లకు ఒకసారి జరిగే జాతరను ఎమ్మెల్యే బడేటిచంటి,జిల్లా యంత్రాంగం ప్రతిష్టాత్మంగా తీసుకుంది. గంగానమ్మ జాతరసాగినంతసేపు ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. జాతర కు ఎన్నడూ లేనంతగా వివిధ ప్రాంతాలనుంచి వేలాదిమంది హాజరయ్యారు. జాతర దృష్టిలో పెట్టుకుని పక్కాగా ప్లాన్ చేశారు. ఎవరికి ఇబ్బంది కలగకుండా,జాతర ఊరేగింపు జరిగేలా ముందుచూపు. పోలీసులకు ముందుగానే రూట్‌మ్యాప్ అందజేసి మరీజాతరలో ఎలాంటి తొక్కిసిలాట గాని,ప్రమాదాలు గానీజరక్కుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, ఒంగోలు, మద్రాసు, ముంబై, బెంగుళూరు,గుంటూరు వంటి ప్రాంతాల నుంచి కూడా గంగానమ్మ జాతరకు బంధువులు మిత్రులు తరలివచ్చారు. జాతర దృష్టిలో పెట్టుకొని బంధు మిత్రులను

- తరువాయి 2లో..

# స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలు

## విద్యా,వైద్యంపై సిఎం సమీక్ష

వర్చువల్‌గా హాజరైన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ,జెసి,జిల్లా అధికారులు




**ఏలూరు,మేజర్‌న్యూస్:**రాష్ట్రసచివాలయం నుండి మంగళవారం జిఎస్‌డిపి వృద్ధిరేటు స్వర్ణాంధ్ర2047లక్ష్యాలు, ఆదాయార్జన శాఖలు, 10 సూత్రాలు అమలు యాక్షన్‌ప్లాన్,విద్యా,వైద్యం,ఏపీకి పెట్టుబడులు, పీపీపీ ప్రాజెక్టుల పురోగతి, రియల్ టైమ్ గవర్నెన్సులో భాగంగా అవేర్,డేటా లేక్ సహా పాలనలో ఏఐ టూల్స్ ఇతర సాంకేతికత వినియోగం,నీటి సంరక్షణ చర్యలు,తదితర అంశాలపై రాష్ట్ర మంత్రులు, కార్యదర్శులతో కలిసి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు,అధికారులతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ తలసరి ఆదాయం ప్రజల జీవన ప్రమాణాలకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రతీ ఐదేళ్లకూ జీఎస్డీపీ,తలసరిఆదాయం

- తరువాయి 2లో..

# డా.కె.ఎస్.ఎన్.రాజుకు నివాళులు

- విష్ణురాజును పరామర్శించిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ



**హైదరాబాద్/భీమవరం,మేజర్‌న్యూస్ :** ప్రముఖులు డాక్టర్ కె.ఎస్.ఎన్.రాజు దశదిన కర్మ (దశహం) కార్యక్రమంలో కేంద్ర ఉక్కు,భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మపాల్గొన్నారు. జూబ్లీహిల్స్‌లోని జె.ఆర్.సి.కన్వెన్షన్‌లో జరిగిన ఈ సంస్మరణ సభలో ఆయన దివంగత కె.ఎస్.ఎన్. రాజు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం వారి కుమారుడు విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ కె.వి.విష్ణు రాజును ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ డాక్టర్ కె.ఎస్.ఎన్.రాజు సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. వారి మరణం కుటుంబానికే కాకుండా సమాజానికి కూడా తీరనిలోటు అని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పలువురు రాజకీయ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# శరవేగంగా అభివృద్ధి పనులు పూర్తి చేయండి

- డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు ఆదేశం



**ఉండి,మేజర్‌న్యూస్:** మహాదేవపట్నం గ్రామంలో శరవేగంగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని డిప్యూటీ స్పీకర్,ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు.సోమవారం సాయంత్రం ఉండి మండలం మహాదేవపట్నం గ్రామంలో మంచినీటి చెరువు కూడిక తీసివేత పనులకు ఆయన ఆయన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు అనంతరం రామచంద్రపురం దగ్గర విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ ఏర్పాటుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన ఆయనకు మహాదేవపట్నం గ్రామ సర్పంచ్, గ్రామ నాయకులు ఘనంగా

- తరువాయి 2లో..

## సంక్షేమం - అభివృద్ధి - సుపరిపాలనకు

# తొలి ప్రాధాన్యత

- సిఎం వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ,జెసి,జిల్లా అధికారులు



**భీమవరం,మేజర్‌న్యూస్:**సంక్షేమం-అభివృద్ధి, సుపరిపాలనకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని, దీనికి అనుగుణంగా మంత్రులు,కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లు కష్టించిపనిచేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం 5వబ్లాక్ సమావేశ మందిరం నందు రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సోమ వారం మంత్రులు,కార్యదర్శులతో సమావేశమై సమీక్షించారు. ఈసమావేశంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకలెక్టర్లు,ఎస్పీలు,జాయింట్ కలెక్టర్లు, అన్ని శాఖల అధికారులు ఆయా జిల్లాల నుండి వర్చువల్గా పాల్గొన్నారు.భీమవరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, అన్ని ాఖల జిల్లా అధికారులు వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలోరాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రసంగంఅనంతరం, వివిధ శాఖల కార్యదర్శులు,ఆశాఖల మంత్రులతో కలిసి ఆయాశాఖలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమంపై

- తరువాయి 2లో..

# సంక్షేమం - అభివృద్ధి - సుపరిపాలనకు తొలి ప్రాధాన్యత

**మొదటిపేజి తరువాయి**

ముఖ్యమంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.పలు అంశాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఆయా శాఖల కార్యదర్శులకు, జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు ఆదేశాలు జారీచేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను నెలలవారీగా సమీక్షించుకుని, క్షేత్రస్థాయిలో పనుల్ని బేరీజు వేసుకోవాలన్నారు. ప్రతీ నెలా రెండు సార్లు కేబినెట్ సమావేశాలు నిర్వహించి, ఎస్ఐపీబీ ద్వారా ప్రాజెక్టులకు ఆమోదం ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, ఇంచార్జ మంత్రులు కూడా అదే వేగంతో క్షేత్రస్థాయిలో పనులు జరిగేలా చూడాలని ఆదేశించారు.గత 19 నెలల నుండి వ్యవస్థలను తిరిగి గాడిన పెట్టగలిగాం అన్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయిందని, తల్లికి వందనం ద్వారా రూ.10 వేల కోట్ల తల్లుల ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. స్త్రీశక్తి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకం ద్వారా మొబిలిటి పెరిగిందని , 4.29 కోట్ల ప్రయాణాలు ఇప్పటి వరకూ జరిగాయన్నారు. అన్నదాత సుఖీ భవ ద్వారా రూ. 6,310 కోట్ల ఆర్థిక సహకారం అందించాం అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ పల్లె పండుగ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో 11,328 కోట్లు వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.10వేల కోట్ల విలువైన పనులు ప్రారంభం అయ్యాయని తెలిపారు. తక్కువ ఆర్థిక వనరులతోనే రాష్ట్రంలో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.భారత ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రప్రభుత్వానికి పూర్తిగా సహకారం అందిస్తున్నారని తెలిపారు.

**- రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గాలి** - రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గాలన్నారు.రోడ్ ప్రమాదాలు తగ్గేందుకు హోం, ఆర్ అండ్ బి శాఖలు కార్యాచరణ చేపట్టాలి. తీవ్ర నేరాల కట్టడి విషయంలో కొన్ని జిల్లాలు ఇంకా మెరుగైన పనితీరు కనబర్చాలన్నారు. ఇకపై శాంతిభద్రతల విషయంపై ప్రతి నెల సమీక్ష ఉంటుందన్నారు. పోలీసింగ్ లో టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడ గంజాయి సాగుకు వీల్లేదని హెచ్చరించారు. డీ-అడిక్షన్ సెంటర్లతో పాటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల ద్వారా మద్యం, డ్రగ్స్ కు బానిసలైన వారిని మార్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసింగ్ లో సకట్సస్ స్టోరీలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత హనానికి పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తాం అని హెచ్చరించారు. 16 ఏళ్లలోపు వారు సామాజిక మాధ్యమాలను వినియోగాన్ని నియంత్రించేలా ఓ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ వివాదాల వల్లే ఎక్కువ ఆత్మహత్యలు జరుగు తున్నాయని,బాధితులకు కౌన్సిలింగ్ ఇప్పించే వ్యవస్థను తీర్చిదిద్దాలని ఆదేశించారు.సమీక్షలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఆర్డబ్ల్యూఎస్,వైద్యశాఖ,స్త్రీశిశుసంక్షేమ శాఖ,ఆర్టిసి,విద్యుత్ శాఖ,ఆర్టిజిఎస్, టెక్నాలజీ తదితర శాఖలోని వివిధ అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు.

## ఇంచార్జ్ ఎంపీడీవోగా రాట్నాలు



**చాట్రాయి,మేజర్‌న్యూస్,** మండల పరిషత్ అభివృద్ధి ఇంచార్జ్ అధికారిగా చేకు చిన్న రాట్నాలు బాధ్యతలు చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న రాట్నాలు చాట్రాయి ఇన్చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా రాట్నాలు మాట్లాడుతూ సాధ్యమైనంత మేరకు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని తెలిపారు. మండల అభివృద్ధికి కృషి చేస్తానని రాట్నాలు తెలిపారు.

## లక్ష్మీ దుర్గ మెడికల్, జనరల్ స్టోర్స్ లైసెన్స్ పునరుద్ధరణ

**బుట్టాయిగూడెం,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ మెమో నం.2982726/11/2025,జనవరి28వ తేదీప్రకారం బుట్టాయి గూడెంలోని లక్ష్మీ దుర్గ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ లైసెన్సు పునరుద్ధరిస్తూ హైకోర్టు ఉత్తర్వుల మేరకు ప్రభుత్వంఆదేశాలుజారీచేసింది. ఆ షాపు యజమాని ఎస్.ఎం.వి.ఫణి కుమార్ దాఖలు చేసిన అప్పీల్‌ను పరిశీలించి, హైకోర్టు ఆదేశాల మేరకు రూల్ 66(2) ఆఫ్ డ్రగ్స్ రూల్స్, 1945 ప్రకారం ఫారమ్-20, ఫారమ్-21 లైసెన్స్‌లు తక్షణమే పునరుద్ధరించబడినట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ప్రభుత్వ పరిశీలనలో డ్రగ్ ఇన్స్పెక్టర్. షేక్.ఆబిద్ అలీ,డి.బి.ఎం.కె.చక్రవర్తి, జిల్లా అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ చేసిన ఆరోపణలతో లైసెన్స్ రద్దు చేయించిన విషయం విధితమే. గర్భస్రావ కిట్లు నిల్వ చేసినట్లు ఆరోపణకు ఆధారాలులేవని,బిఎన్ఎస్ఎస్ చట్టం,2023 ప్రకారం అవసరమైన సీజ్ ప్రక్రియలు అనుసరించ బడలేదని, లైసెన్స్ రద్దు నిర్ణయం తగిన విధంగా పరిశీలించకుండా, విధానపరమైన లోపాలతో తీసుకున్నదని హైకోర్టు పేర్కొంది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.ఈ నిరాధార ఆరోపణల కారణంగా, గత 7 నెలలుగా జీవనోపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నానని.కుటుంబ పోషణ, జీవనాధారం నిలిచిపోయి, ఊర్లో గత 20 సంవత్సరాలుగా సంపాదించుకున్న పేరు పరువు నమ్మకం కోల్పోయినా కుటుంబం తీవ్ర మానసిక వేదనకు గురి అయిందని. నా తండ్రి ఆరోగ్యం పూర్తిగా పాడయిందని షాపు యజమాని ఫణి కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంలో, నా లైసెన్స్ పునరుద్ధరణకు న్యాయం చేసిన మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్,డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఉన్నతాధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపు తున్నానని వివరించారు.ఈ నిర్ణయం ద్వారా లక్ష్మీ దుర్గ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ మళ్లీ ప్రారంభించి బుట్టాయిగూడెం ప్రజలకు ఔషధ సేవలు అందించడానికి అవకాశం లభించిందని తెలిపారు.


## 4 కార్మిక కోడ్ల అమలుకు చేస్తున్న ప్రయత్నాలు విడనాడాలి



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** శతాబ్ది కాలంగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను రద్దుచేసి నాలుగు కార్మిక కోడ్లను కేంద్ర ప్రభుత్వం అమలు కు చేస్తున్న ప్రయత్నాలను తక్షణమే విడనాడాలని ఎఐటియుసి ఏలూరు ఏరియా కార్యదర్శి ఏ అప్పలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.నాలుగు కార్మిక కోడ్లను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 12వ తేదీన కేంద్ర కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని,ఆ పిలుపును జయప్రదం చేయుటకు ఏలూరు కార్పొరేషన్ లోని ఇంజనీర్ విభాగం ఉద్యోగ సిబ్బంది సహకరించాలని అప్పలరాజు కోరారు. 12వ తేదీ సమ్మెపై సోమవారం ఆర్ఆర్ పేటలో ఉన్న ఎస్ ఆర్ టు వద్ద ఏఐటీయూసీ అనుబంధ ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కార్యకర్తలు ప్రసార కార్యక్రమాన్ని చేపట్టి సమ్మె కరపత్రాలను ఉద్యోగ సిబ్బందికి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి బి నారాయణరావు, సహాయ కార్యదర్శి డివెంకటేశ్వరరావు,యూనియన్ కార్యకర్తలు కే బాలాజీ, డిఅప్పారావు, కందుల శ్రీను, జి రవి, ఎంరాజా శ్రీనివాస్, డిప్రసాద్, ఏశ్రీను,ఎస్ మల్లేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మంగారి మఠం అభివృద్ధికి నిధులు

**- కేంద్ర పర్యాటక శాఖా మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కు వినతి**
**ఎంపీ అయినా పుట్టిన ప్రాంతం**
**అభివృద్ధి మర్చిపోని పుట్టా మహేష్ కుమార్**



**న్యూఢిల్లీ /ఏలూరు,మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలో ఉన్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం కోసం ప్రసాద్ (తీర్థయాత్ర పునరుజ్జీవనం, ఆధ్యాత్మిక వృద్ధి డ్రైవ్) పథకం కింద నిధులు మంజూరు చేయాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కేంద్రాన్ని కోరారు. ఢిల్లీలో తన తండ్రి, మైదుకూరు ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ తో కలిసి కేంద్ర పర్యాటక శాఖా మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ను కలిసిన ఎంపీ ఈ మేరకు కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేశారు. బ్రహ్మం గారి మఠం విషయంలో, ప్రతిపాదిత అభివృద్ధి పనులకు సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్టు నివేదికను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖకు ఇప్పటికే సమర్పించిన్నట్లు చెప్పిన ఎంపీ, శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం మత, చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యతను కేంద్ర మంత్రికి వివరించారు. ఈ క్షేత్రానికి ఆంధ్రప్రదేశ్ తో పాటు ఇతర రాష్ట్రాల నుండి వేలాదిగా భక్తులు వస్తారని, "ప్రసాద్ " పథకం కింద మౌలిక సదుపాయాలను మెరుగుపరచి మఠాన్ని అభివృద్ధి చేయడం వల్ల యాత్రికుల సౌకర్యాలు పెరిగి, ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రోత్సాహం లభించడంతో పాటు స్థానిక ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఎంపీ వివరించారు.కేంద్ర మంత్రిని కలిసిన అనంతరం ఎంపీ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కడప జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం అభివృద్ధి ప్రాజెక్టు గురించి కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తో మాట్లాడటం జరిగిందని, 2026-27 ఆర్థిక సంవత్సరంలో నిధుల కేటాయింపు చేస్తామని హామీ ఇచ్చారని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడించారు.

## జాతర ముగిసింది - సంతోషం మిగిలింది

**మొదటిపేజి తరువాయి**

ఆహ్వానించడం ఆనావాయితీ. అలాగే కొర్లబండి ఊరేగింపులో ఉత్సాహంగా ప్రదర్శన నిర్వహించారు. ఈసారి వివిధ వేషధారణ కలిగినవారుఏలూరువీధుల్లోచిందులుతొక్కారు.దగ్గరగా నృత్యాలను తొలగించేం దుకు స్థానికులు ఎగబడ్డారు. సెల్ఫీలు దిగారు.

**- చివరిగా తంగిళ్ళమూడిలో -**వందరోజుల గంగానమ్మ జాతరలో చివరిగా తంగేళ్లమూడిలో సోమవారం కొర్ల బండి ప్రదర్శన సాగింది. అట్టహాసంగా వీధుల్లో విచిత్ర వేషధారణ కలిగిన వారు నృత్యాలు చేశారు. అందర్నీ కనువిందు చేసేలా, ఆకట్టుకునేల ప్రదర్శన ముందు సాగింది.వివిధ ప్రాంతాల నుంచిఅనేకమంది జాతరను తిలకించేందుకు ఏలూరుకు తరలివచ్చారు. దీంతో ఏలూరు వీధులు కిట కిటలాడాయి. పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు.గంగానమ్మ జాతరను విజయవంతం చేయడానికి ఉమ్మడి ప్రణాళిక దాదాపు కలిసి వచ్చింది.ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ నూర్జహాన్‌పెదబాబు,ఈడచైర్మన్ ప్రసాద్ ,డిప్యూటీమేయర్ సోడే వెంకటరత్నం,జాతర నిర్వాహకులు ఇంకోవైపు పోలీసులు ఉమ్మడి ప్రణాళిక రూపొందించి దీని ప్రకారమే మొత్తం సాగించారు. పోలీసులుసాధ్యమైనంతమేర సంయమనం పాటిస్తూ జాతర సాగేలా చూశారు ఐజి అశోక్ కుమార్ ఎస్పీకిషోర్, డిఎస్పి శ్రావణ్‌కుమార్ ఎప్పటికప్పుడు ఏలూరు పోలీసులనుఅప్రమత్తం చేయడంద్వారా ఒడిదుడుకులు లేకుండా జాతరప్రశాంతంగా ముగిసింది.

## స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలు విద్యా,వైద్యంపై సిఎం సమీక్ష

**మొదటిపేజి తరువాయి**


రెట్టింపు అయ్యేలా ప్రణాళికలు చేపట్టాలన్నారు. పీ4 అనేది రాష్ట్రంలో ఆర్థిక అసమానతలుతగ్గించేప్రత్యేక కార్యక్రమమని, బంగారు మిత్రలద్వారాఆయాపేద కుటుంబాలను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏలూరు దగ్గర కోకో సిటీ ఏర్పాటు గురించి కూడా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. జిల్లా కలెక్టరేటు నుండి వర్చువల్‌గా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్, జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి,జిల్లా వివిధ శాఖలు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## శరవేగంగా అభివృద్ధి పనులు పూర్తి చేయండి

**మొదటిపేజి తరువాయి**

స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్ క్లినిక్ సెంటర్ ఆరు నెలల కాలంలో నిర్మాణం పూర్తి చేసుకుని ప్రజలకు అందుబాటులోకి వస్తుందని అందుకు అధికారులు సంసిద్ధత వ్యక్తం చేయడం జరిగిందని ఇప్పటికే మహాదేవపట్నం గ్రామంలో ఒక హెల్త్ క్లినిక్ ఉందని దీంతో రామచంద్రపురం నివాసులకు పూర్తిస్థాయిలో వైద్యం అందుబాటులోకి వస్తుందని కూటమి ప్రభుత్వం విద్య ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని ఆయన అన్నారు దాదాపు 5 కోట్ల రూపాయల నిధులతో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పూర్తి చేయడం కూడా జరిగిందని వారు తెలిపారు మహాదేవపట్నం గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఆయన మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జుత్తుగ నాగరాజు, గ్రామ సర్పంచ్ వనమా సుబ్బలక్ష్మి శ్రీనివాస్, శివరాజు, టిడిపి అధికార ప్రతినిధి వనుమా శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, కర్రీ శ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షుడు మురళీకృష్ణ (చిన్న) తాహసిల్దార్ కావడి నాగార్జున, గ్రామ కార్యదర్శి జెవిటి నాయుడు, వీఆర్వో చిన్నారావు తదితరులతోపాటు వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ గోపి మూర్తిని కలిసిన మహిళా కళాశాల అధ్యాపకులు



**నరసాపురం,మేజర్‌న్యూస్ :** స్థానిక బిజిబిఎస్ మహిళ కళాశాల అధ్యాపకులు యుటిఎఫ్ భవనం వద్ద ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి గాని కలిసి కళాశాలలో తమకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. సోమవారంగోపి మూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు.కరస్పాండెంట్‌నూలి వెంకటనారాయణరావు, ప్రిన్సిపల్ చొప్పల నీరజచేస్తున్న ఆకృత్యాలగురించి వివరించి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాలఅధ్యాపకులు పి.ఝాన్సీలక్ష్మి వి.గంగాలక్ష్మి టి.ఎల్. ఎస్. మనోహరి ఓ.జ్యోతి ఏఎస్ చెట్టి ఆస్తుల పరిరక్షణ కమిటీ సభ్యులు బిళ్ళ బ్రదర్స్ పాల్గొన్నారు.

# వారధి ట్రస్ట్ సేవలు అభినందనీయం





**– డిసిసిబి మాజీ చైర్మన్ కరాటం రాంబాబు**

**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** స్థానిక నాలుగవ వార్డు మున్సిపల్ కౌన్సిలర్,వారధి ట్రస్టు వ్యవస్థాపకులు వలవల తాతాజీ సమాజానికి చేస్తున్న సేవలు అభినందనీయం అని డిసిసిబి మాజీ చైర్మన్ కరాటం రాంబాబు అన్నారు. ఇందిరానగర్ కాలనీలో శ్రీ అభయాంజనేయ స్వామి వారి నవమ (9వ) వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది.ఆలయ నిర్మాణ కర్త వలవల తాతాజీ,మేరీ సుశీల దంపతులచే కురెళ్ళ రాంబాబు శర్మ ఆధ్వర్యంలో పలు పూజా కార్యక్రమాలు,లక్ష్మీ గణపతి హోమం జరిగింది.ఆధ్యాత్మికవేత్త కెఎల్ఎన్ ధనుకుమార్ హనుమద్ వైభవం అనే అంశంపై ప్రవచనం అందించారు. స్వామివారిని సినీ నిర్మాత,డిసిసిబి మాజీ చైర్మన్ కరాటం రాంబాబు,టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్,జిల్లా ఉపాధ్యక్షులు రావూరి కృష్ణ,సీనియర్ నాయకులు పెనుమర్తి రామ్ కుమార్,పరిమి సత్తిపండు, రాజాన సత్యనారాయణ, దాకారపు కృష్ణ,మహంకాళి రామ్మోహన రావు, గుమ్మడి ప్రసాద్,కౌన్సిలర్ కరుటూరి రమాదేవి,జనసేన నాయకులు గడ్డమణువు రవికుమార్,ఉక్కుర్తి సీతారాం,పలువురు నేతలు, కౌన్సిలర్లు, తదితరులు దర్శించుకున్నారు. మహా అన్న సమారాధాన కార్యక్రమాన్ని కరాటం రాంబాబు, పెనుమర్తి రామ్ కుమార్,రావూరి కృష్ణ ,తదితరులు ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నాట్యాచారిని శిలం రూపాదేవి శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు.

ఈ సందర్భంగా రూపాదేవిని ఘనంగా సత్కరించారు.నాట్య బృందానికి కరాటం రాంబాబు రూ.5వేలు,చిరంజీవి యువత అధ్యక్షులు ఉక్కుర్తి సీతారాం రూ.2వేలు అందజేశారు. శ్రీ అభయాంజనేయ కోలాట బృందం కోలాట ప్రదర్శన నిర్వహించారు.ఈ బృందానికి కరాటం రాంబాబు రూ.5వేలు అందజేశారు. వలవల తాతాజీ నేతృత్వంలోని వారధి ట్రస్ట్ నుండి దాతల సహకారంతో గుర్రం శాంతి అనే విభిన్న ప్రతిభావంతురాలికి రూ 27 వేల విలువగల విద్యుత్ మిషన్‌ను రాంబాబు అందించారు. దీనికి అవసరమయ్యే మెటీరియల్‌ని తను సమకూరుస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో వలవల తాతాజీ,మేరీ సుశీల దంపతులు కరాటం రాంబాబు, పెనుమర్తి రామకుమార్ సత్కరించారు.

ఈ కార్యక్రమంలో తాతాజీ కుమార్తె నందిని, కుమారుడు సాయి కార్తికేయ, పాల్గొన్నారు. పలు వైద్య శిబిరాల ద్వారా రోగులకు వైద్య సేవలు అందించారు.

# అద్దెకు దిగి నమ్మకంగా కిలో వెండి, రూ.70వేల నగదుతో ఉడాయించిన దొంగ



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** అద్దెకు ఉంటానని వచ్చాడు. యజమాని నమ్మకాన్ని ఆసరాగా చేసుకున్నాడు. అదను చూసి అందినకాడికి దోచుకుని ఉడాయించాడు.ఇంట్లో భద్రపరిచిన సుమారు కేజీ వెండి, రూ. 70వేలు నగదు అపహరించాడు. జంగారెడ్డిగూడెం మండలం, దేవులపల్లి గ్రామంలో సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి హోటల్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 18వ తేదీన ఒక గుర్తు తెలియని వ్యక్తి సుబ్రహ్మణ్యం ఇంట్లో అద్దెకు దిగాడు. ఆదివారం సాయంత్రం హోటల్ వ్యాపారం రద్దీగా ఉన్న సమయంలో ఆ అద్దెకు ఉంటున్న వ్యక్తి తన ప్లాన్ అమలు చేశాడు. హోటల్ వద్ద ఉన్న యజమాని వద్దకు వెళ్లిన వ్యక్తి మా వాళ్లు వస్తున్నారు. వారికోసం టిఫిన్ సిద్ధంగా ఉంచండి అని నమ్మబలికి గదిలోకి వెళ్లి తన సామాన్లు సర్దుకుని, యజమానికి అనుమానం రాకుండా అక్కడి నుండి జారుకున్నాడు.చాలా సేపటి వరకు అద్దెకు ఉన్న వ్యక్తి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన సుబ్రహ్మణ్యం, లోపలికి వెళ్లి చూడగా షాక్‌కు గురయ్యారు. ఇంట్లో భద్రపరిచిన సుమారు కేజీ వెండి, రూ. 70వేలు నగదు ,ఇతర విలువైన వస్తువులను ఆ వ్యక్తి అపహరించుకు పోయినట్లు గుర్తించారు.బాధితుడు వెంటనే లక్కవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.కొత్త వ్యక్తులకు ఇళ్లు అద్దెకు ఇచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని,వారి వివరాలను సేకరించాలని పోలీసులు సూచించారు.

# ప్రజలపై ప్రతీకార యాత్రలో జగన్.



**– టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డా.దాసరి శ్యామ్ చంద్ర శేషు**

**న్యూఢిల్లీ/జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్ :** కల్తీ నెయ్యిలో అడ్డంగా దొరికి క్షమాపణ కోరకుండా మొండిగా బుకాయింపు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన 5సంవత్సరాల పాలనలో ల్యాండ్, శాండ్, వైన్, మైన్ అన్నింటిలో అవినీతి. అన్నింటిలో అవినీతి చేసి అది సరిపోలేదని ఆఖరికి కోట్లాది మంది భక్తులు ఎంతో భక్తితో కొలిచే కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి వారి ప్రసాదంలో కూడా కెమికల్స్ వాడి లడ్డు తయారుచేయడం క్షమించరాని నేరం టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డా. దాసరి శ్యామ్ చంద్రశేషుఅన్నారు. సోమవారం సాయంత్రం ఢిల్లీలోని ఏపీ భవన్ లో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఒక్క పాల చుక్క కూడా లేకుండా నెయ్యి కెమికల్స్ తో తయారుచేసి లడ్డు తయారీలో వాడటం అత్యంత దారుణం అని, దీనిపై దేశ ప్రజలకు, వెంకటేశ్వర స్వామి వారి భక్తులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు. ఒక పక్క కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో దేశంలోనే అతిపెద్ద విదేశీ పెట్టుబడి గూగుల్ డేటా సెంటర్, కాగ్నిజెంట్, క్వాంటం కంప్యూటింగ్ అంటూ పెద్దఎత్తున ఉపాధి ఉద్యోగావకాశాలు కల్పిస్తూ పెట్టుబడులను ఆకర్షిస్తుంటే ప్రతిపక్ష నేత ఏమో శాంతి భద్రతల విఘాతం కోసం పనిచేస్తున్నారని అన్నారు.ధైర్యముంటే అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడాలని అన్నారు.ఈ మీడియా సమావేశంలో బిసి యూత్ అధ్యక్షుడు పరిస సాయి వినయ్,ఐ టిడిపి కార్యదర్శి తెనాలి చంద్ర శేఖర్, కేసన హేమంత్ కుమార్ తదితరులు ఉన్నారు.

# గ్రామీణ ఉపాధి చట్టాన్ని కొనసాగించాలి : బికెఎంయు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** గత 20 సంవత్సరాలుగా గ్రామీణ పేదలకు ఎంతో క ్లా ం త ఉపయోగపడుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడంపై ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికెయంయు) జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు ప్రభుత్వ చర్యను తీవ్రంగా విమర్శించారు.సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద బికెఎంయు నాయకులు నిరసన తెలిపి, ఏపీఓకు ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం ఇవ్వడం జరిగింది. బికెయంయు, సిపిఐ, ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ రాష్ట్ర సమితుల పిలుపులో భాగంగా గ్రామీణ పేదల ఉపాధికి నష్టం చేకూర్చే వికసిత్ భారత్ జి రాం జి పథకాన్ని రద్దు చేయాలని కోరుతూ బికెఎంయు నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని కొనసాగిస్తూ, కుటుంబానికి సంవత్సరానికి 200 రోజులు పని కల్పించి, రోజు కూలి 800 రూపాయలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమానికి బికెఎంయు ఏలూరు రూరల్ మండల కార్యదర్శి పొట్టేలు పెంటయ్య, జిల్లా కమిటీ సభ్యులు బుగ్గల ప్రభాకర్, ఎఐటియుసి నాయకులు పళ్లెం కిషోర్, పుప్పాల కన్నబాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మధుర రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ సంక్షేమ పథకాలు అమలు చేయాలి



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్లుగా భవన నిర్మాణ సంక్షేమ పథకాలను రాష్ట్రంలో అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవి రమణ డిమాండ్ చేశారు. ప్రగతి సేన ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఇఫ్టూ అనుబంధం డివిజన్ విస్తృత స్థాయి సమావేశం సోమవారం స్థానిక ధర్మన్న స్మారక భవనంలో జరిగింది. సమావేశంకు యాదాల వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి కె.వి.రమణ మాట్లాడుతూ గత 7 సంవత్సరాలుగా నిలిపి వేసిన భవన నిర్మాణ సంక్షేమ పథకాలను ప్రారంభించామని సిఎం చంద్రబాబు నాయుడు ప్రకటించడం హర్షించదగిన విషయం అన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలను రాష్ట్రంలో అమలు పరచాలని కోరారు.రాష్ట్రంలో ఉన్న అన్ని కార్మిక సంఘాలతో రాష్ట్ర,జిల్లా బోర్డులను ఏర్పాటు చేయాలని రమణ కోరారు.సమావేశంలో తలారి రెడ్డి కృష్ణ,పుచ్చుల శ్రీను, బాలం నరేష్, వాసుబోయిన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


## లింకు డాక్యుమెంట్లు పోయినవి

పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం మార్టేరు శివాలయం వీధిలో నివాసం ఉంటున్న కోడిరాంబాబు భార్య నాగలక్ష్మి తెలియజేయునది ఏమనగా భీమవరం జిల్లా రిజిస్టార్ వారి పరిధిలోని పెనుగొండ సబ్ రిజిస్టర్ కార్యాలయ పరిధికి చెందిన పెనుమంట్ర మండలం మార్టేరు గ్రామపంచాయతీ ఏరియాలోని డోర్ నెంబర్4–130కి చెందిన డాబా ఇల్లు లింక్ డాక్యుమెంట్లు పోయినవి. ఈనెల రెండవ తేదీన మేము నివాసముంటున్న శివాలయం వీధి నుండి జిరాక్స్ తీయించుకునేందుకు సెంటర్‌కు వెళ్తూఉండగా **229/2022, 630/2022** నెంబర్లుగల సెంటున్నర భూమికి సంబంధించిన రెండు లింకు డాక్యుమెంట్లు మార్గమధ్యలో పడిపోయినవి.దొరికిన వారు అందజేయవలసిందిగా కోరుతున్నాను.

ధన్యవాదములతో

**కోడి నాగలక్ష్మి**

వైఫ్ ఆఫ్ రాంబాబు,మార్టేరు,సెల్ నెంబర్ **9704064950**

# పిజిఆర్ఎస్ అర్జీలు నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలి



- జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు

ఏలూరు,మేజర్ న్యూస్ : జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు పాటు ట్రైనీ ఐపిఎస్ జయాశర్మ, ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్, కెఆర్ సిసి డిప్యూటీ కలెక్టరు యల్.దేవకిదేవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు కె.భాస్కర్, సర్వే సహాయక సంచాలకులుఅన్సారీలు కలిసి జిల్లాలో వివిధ ప్రాంతాలు నుండి వచ్చిన ప్రజల నుండిఅర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు మాట్లాడుతూ పిజిఆర్ యస్, రెవిన్యూ క్లినిక్ లలో ప్రజలు సమర్పించిన అర్జీలుపై అధికారులు అత్యంత ప్రాధాన్యతనుఇవ్వాలని, క్షేత్రస్థాయిలో అర్జీదారులతో స్వయంగా మాట్లాడి నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు.

వచ్చిన అర్జీలలో కొన్ని - లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన మేకల రాజబాబు సర్వే నెంబరు 513/3బి నా భూమిని కమర్షియల్ భూమిగామార్చవలసిందిగా కోరియున్నారు, ముదినేపల్లి మండలం ముదినేపల్లి - అంబేద్కర్ నగర్ నివాసి సావా నాగ జగన్ బాబురావు ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనానికి గ్రామ పంచాయతీలో తీర్మానం జరిగిందని, భూమిని కేటాయించాలని కోరారు, దెందులూరు మండలం గోపన్నపాలెం గ్రామానికి చెందిన చౌటుపల్లి విక్రమ కిషోర్ టిడ్కో ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించ వలసిందిగా కోరియున్నారు, వేలేరుపాడు మండలం రేపాకగొమ్ము చెందిన గుమ్మల్ల పుల్లయ్య పోలవరం ముంపు ప్రాంతానికి నాకు రావాల్సిన నష్టపరిహారం బ్యాంకులో జమ చేశామని అధికారులు చెప్పారు కాని నాకు జమ కాలేదని, జమ చేయించవలసిందిగా కోరారు, ఏలూరు 26వ డివిజన్- శనివారం పేటకు చెందిన బత్తిన గణేష్ వెంకట సుబ్బారావు గతంలో ఒక ప్రైవేటు సంస్థలో పనిచేసాను నాకు 61 సంవత్సరాలు నిండాయి పని చేయలేకపోతున్నాను. నాకు రావలసిన పిఎఫ్ ఇతరసదుపాయాలుమంజూరు చేయించవల సిందిగా కోరారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, జిల్లాకలెక్టరేటు సూపరిటెండెంట్లు, తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

# జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి



- ఏఐవైఎఫ్ ఏలూరు జిల్లా కోకన్వీనర్ తొర్లపాటి రాజు

ఏలూరు,మేజర్ న్యూస్ : గత ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు వాగ్దానం చేసిన విధంగా తక్షణం జాబ్ క్యాలెండర్ ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ ఏలూరు జిల్లా కోకన్వీనర్ తొర్లపాటిరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జిల్లాకలెక్టర్ కార్యాలయంనందు పిజిఆర్ఎస్ లో ఏఐవైఎఫ్ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తొర్లపాటి రాజు మాట్లాడుతూరాష్ట్రంలోని కూటమి పెద్దలు ఎన్నికల సమయంలో రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీలను అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే భర్తీ చేస్తామని,ప్రతి సంవత్సరము జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని, నిరుద్యోగ యువతకు శిక్షణ,ప్రోత్సహకాలుఇచ్చి పారిశ్రామికవేత్తలుగా మారుస్తామని, నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీని తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి 19 నెలలు గడచినా కూడా ఒక్క హామీ అమలుకు నోచుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్పైరానున్న అసెంబ్లీ సమావేశాల లో ప్రకటించాలి,ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ యువతకు నెలకు రూ. 3వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ఏలూరు జిల్లా కన్వీనింగ్ కమిటీమెంబర్ కురెళ్ళ వరప్రసాద్, బొల్లవరపు శేఖర్ పాల్గొన్నారు.

# దీనిని వాష్ రూమ్ అంటారా ?





- మల మూత్రాలకు వెళ్ళాలంటే నరకమేగా !
- గుండుగొలను హైస్కూల్ విద్యార్థినుల అవస్థలు
- కంపుకొడుతున్న టాయిలెట్స్ - శుభ్రం చేసేవారిని కూడా మాన్పించేసారేమిటి ?

భీమడోలు,మేజర్న్యూస్ : మండలంలోని గుండుగొలను మావులేటి సోమరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలు మల మూత్రాలకు వెళ్ళాలంటే నరకం అనుభవిస్తున్నారు. టాయిలెట్స్ శుభ్రం చేసేవారిని మాన్పించు వేయడంతో బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం బాలికలు రుతుస్రావం సమయంలో వాష్ రూమ్కి వెళ్ళాలన్నా బాత్రూమ్ నిండా కుప్పలు తెప్పలుగా ప్యాడ్స్తో దర్శనమిస్తున్నాయి. భరించలేని దుర్గంధంతో బాలికలు నరకం అనుభవిస్తున్నారు.నిన్న మొన్నటి వరకు టాయిలెట్స్ శుభ్రపరచు వారు ఉండేవారు.ఇప్పుడువారిని మాన్పించి వేయడంతో మల మూత్రాలతో కంపుకొడు తున్నాయని బాలికలు తల్లిదండ్రులకు తమ గోడు వెళ్ళబోసు కుంటున్నారు.

ఇదే విషయమై ప్రధానోపాధ్యాయురాలుకు తెలపగా ఎటువంటి స్పందన రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో బాలికలు ఉన్నారు. బాలికల అవస్థలు దృష్టిలో పెట్టుకుని వెంటనే టాయిలెట్స్ శుభ్రం చేసేవారిని పునః నియమించి టాయిలెట్స్ అందుబాటులోకి తీసుకురావాలని కొంతమంది పేరెంట్స్ మీడియా దృష్టికి తీసుకు వచ్చారు. ఇదిలావుండగా బాలికల టాయిలెట్స్ క్లీన్ చేయించే వారిని ప్రధానోపాధ్యాయురాలే మాన్పించి బాలికలతో శుభ్రంచేయిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానో పాధ్యాయురాలు మహిళ అయి ఉండి బాలికల పట్ల శ్రద్ధ చూపడం లేదని పలువురు తల్లి,తండ్రులు ఆరోపిస్తున్నారు.

# కళ్యాణంపాడులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



లింగపాలెం, మేజర్ న్యూస్: లింగపాలెం పంచాయతీ పరిధిలో కళ్యాణంపాడులో సోమవారం కూటమి ప్రభుత్వ నాయకుల ఆధ్వర్యంలో శరవేగంగా కొనసాగుతున్న డ్రైనేజీలు పనులు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధిని సంక్షేమాన్ని రెండు కళ్ళులా భావించి పరిపాలన కొనసాగిస్తుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ టి హేమలత,ఎంపీటీసీ భీమిరెడ్డి స్వరూప రాణి,మాజీ ఎంపీపీ సొసైటీ చైర్మన్ మొరంపూడి మల్లికార్జున రావు, లింగపాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు తాతిన రమేష్, లింగపాలెం మండలం ఐటీడీపీ అధ్యక్షులు తాతిన రాధాకృష్ణ, టిడిపి సీనియర్ నాయకులు గంట శ్రీను, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి చవెంకట నాగేశ్వరరావు బిజెపి మండల రైతు సంఘం అధ్యక్షులు తాతీన సత్యనారాయణ,పంచాయతీ టిడిపి మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అసిలేటి అజయ్,గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి బుల్లా రవికుమార్, టిడిపి మండల పార్టీ కార్యదర్శి రాఘవులు, కంభం రవి, అసిలేటి రాజేష్, పొదిల శౌరి, తదితర నాయకులు పాల్గొన్నారు.

## 12న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి


- వ్యవసాయ కార్మిక, రైతు, కౌలు రైతు సంఘాలు పిలుపు



ఏలూరు,మేజర్ న్యూస్ : ఈనెల 12న జరుగుతున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక,రైతు,కౌలు రైతు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం అన్నే భవనంలో ఆయా సంఘాల నాయకులు సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, నాయకులు రాజశేఖర్,మాధవ మాట్లాడారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులతో పాటు రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం తీసుకురావాలని కోరారు. రైతు, ప్రజా వ్యతిరేక కేంద్ర విద్యుత్ సవరణ బిల్లు, విత్తన చట్టాలను రద్దు చేయాలన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ లను రద్దుచేసి కార్మిక హక్కులను కాపాడాలని కోరారు.

## మాముడూరులో చెట్లు నరికివేత - స్థానికుల ఆందోళన



పెనుమంట్ర,మేజర్న్యూస్ : మాముడూరు గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు కొందరు ఆదివారం కొన్ని చెట్లను మొదలకు నరికేశారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటన పట్ల ఎవ్వరూ పట్టించుకోక పోవడంతో శీ సోమవారం ఉదయం కొన్ని చెట్లకు నిప్పు పెట్టి, వాటిని అగ్నికి ఆహుతి చేసిన సంఘటన జరిగిందని వారు వాపోయారు. అగంతకులు చేసిన ఈ చర్యలకు గ్రామం లోని ఆర్ అండ్ బి రోడ్డులో రేలంగి కెనాల్ ఛానల్ గట్టు పక్కన గతంలో ఉపాధి హామీ హామీ పథకం కింద లక్షల రూపాయల నిధులు వెచ్చించి పెంచిన చెట్లు నాశనం అయ్యాయని స్థానికులు అన్నారు. ఈ సంఘటనలకు బాధ్యతలు అయిన వారిని గుర్తించి, అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేశారు.

# ప్రజలకు వివిధ ఆర్థిక అంశాలపై అవగాహన




– ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల గోడ పత్రిక ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

**భీమవరం,మేజర్‌న్యూస్ :** ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి 9 నుండి 13 వ తేదీ వరకు నిర్వహించుచున్న అవగాహన కార్యక్రమాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకువెళ్లి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నందు 2026 ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు అవగాహన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రజలు తమ ఆర్థిక వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించుకునేలా అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విస్తృతంగా నిర్వహించాలని అన్నారు. పొదుపు అలవాట్లు, బ్యాంకింగ్ సేవల వినియోగం, డిజిటల్ లావాదేవీలు, రుణాల నిర్వహణ, బీమా పెట్టుబడులుపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించడం అవసరమని అన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు మహిళలు యువత స్వయం సహాయక సంఘాల సభ్యులు రైతులుఆర్థిక అక్షరాస్యతను పెంపొందించు కోవడం ద్వారా ఆర్థిక స్వాలంబనను సాధించగలరని తెలిపారు.ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా బ్యాంకులు ఆర్థిక సంస్థలు ప్రభుత్వ శాఖల సమన్వయంతో అవగాహన సదస్సులు శిక్షణా కార్యక్రమాలు ర్యాలీలు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ఏ.నాగేంద్ర ప్రసాద్,జిల్లావ్యవసాయశాఖఅధికారి జెడ్.వెంకటేశ్వ రరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సమ్మె పోస్టర్ విడుదల




**నరసాపురం, మేజర్ న్యూస్ :** ఈ నెల 12వ తేదీన నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో కార్మిక ఉద్యోగ వర్గం పెద్ద ఎత్తున పాల్గొనాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు పిలుపునిచ్చారు. సోమవారంస్థానిక సివిల్ సప్లై గోడౌన్ కార్మికులతో సమ్మె పోస్టర్లను బ్యానర్లను విడుదల చేశారు.ఈ సందర్భంగా నూతన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి, 12 గంటల పని విధానాన్ని వెనక్కి తీసుకోవాలి, కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ కార్పొరేట్ శక్తుల వత్తులతో పాలకవర్గం లేబర్ కోడ్స్ ను అమలులోకి తెచ్చింది అన్నారు. కార్మిక వర్గాన్ని మరింతగా దోచుకోవటానికి ఇప్పుడున్న కార్మిక చట్టాలు అడ్డుగా ఉన్నాయని నెపంతో లేబర్ కోడ్స్ తీసుకువచ్చారని విమర్శించారు. కార్మిక వర్గానికి ఇప్పుడున్న హక్కులను తొలగించటమే లేబర్ కోడ్స్ లో ప్రధాన ఉద్దేశం అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటి పట్టణ కన్వీనర్ ఓడి లక్ష్మణ్,గుడం కార్మిక సంఘం నాయకులు రవికిరణ్,కె నాగేశ్వరరావు, జి బలి చక్రవర్తి,శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికులకు నెల నెలా సక్రమంగా జీతాలు చెల్లించాలి

– డిపిఓకి సమస్యలపై గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ వినతి



**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధకు సోమవారం ఏపీ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకత్వం కార్మికుల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో 547 పంచాయతీలలో రెండువేల మంది పైగా పంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారని అన్నారు. కంప్యూటర్ ఆపరేటర్స్, పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్స్, స్వీపర్లు, డ్రైవర్లుగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ పద్ధతులలో పని చేస్తున్నారన్నారు.ఈ సిబ్బందికి జిల్లాలో అత్యధిక పంచాయతీల్లో ఈ ప్రతినెల సకాలంలో జీతాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.2 నుండి 8 నెలలుగ జీతాలు బకాయిలు పేరుకుపోయాయన్నారు. జాలిపూడి 4 నెలలు, పెదపాడు 4 నెలలు కైకలూరు 7 నెలలుగా జీతాలు బకాయిలు ఉన్నాయన్నారు. కార్మికుల సమస్యలతో కూడిన వినతి పత్రం డిపిఓ కే అనురాధకు అందించారు. దీనిపై డిపిఓ అనురాధ స్పందిస్తూ జిల్లాలో వివిధ పంచాయతీల్లో బకాయిలను మార్చి నెలాఖరుకు క్లియర్ చేయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఏలూరు ఏరియా కార్యదర్శి ఏ అప్పలరాజు, నాయకులు బి జగన్నాథ రావు తదితరులు పాల్గొన్నారు.

# దొంగ అరెస్ట్ : రూ.1లక్ష 40వేలు స్వాధీనం



**చాట్రాయి, మేజర్‌న్యూస్,** ఇటీవల కాలంలో మండలంలోని నరసింహారావు పాలెం సొసైటీ లో జరిగిన దొంగతనం కేసులో దొంగను అరెస్టు చేసినట్లు చాట్రాయి ఎస్ఐ డి.రామకృష్ణ తెలిపారు. అనుమానితుల కోసం ప్రత్యేక బృందాలను సాంకేతికత కూడిన నిఘా ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. ఈ కేసులో నరసింహారావు పాలెం గ్రామానికి చెందిన నక్క గంగాధర్ రావు సొసైటీ తాళాలు పగలగొట్టి రూ.1లక్ష40వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ముద్దాయిని అరెస్ట్ చేసి కోర్టుకు పంపించినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

# రాష్ట్ర విజేతలుగా జంగారెడ్డిగూడెం విద్యార్థులు



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** యూనిటెడ్ ఫారం ఫర్ ఖురానిక స్టడీస్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలు విజయవాడలో జరిగాయి. ఈ పోటీలలో జంగారెడ్డిగూడెం విద్యార్థులు 5 పథకాలు సాధించి విజయ ఢంకా మ్రోగించారు. రాష్ట్ర స్థాయి ప్రథమ స్థానంలో షేక్ సాదియా రూ. 20 వేలు అవార్డు గెలుపొందింది.వివిధ గ్రూపులలో షేక్ రహమత్, ఆయేషా,షిబా సులైన్,షేక్ వాజీదా రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి రూ.15వేలు చొప్పున బహుమతులను గెలుచుకున్నారు. ఈ విజేతల సన్మాన సభ సోమవారం అజారుద్దీన్ అండ్ జామ ఇస్లామిక్ సెంటర్ నందు జరిగింది.ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో షేక్ టిప్ టాప్ బాజీ, షేక్ ముస్తఫా,షాహెబ్, షాహిన, షాజహాన్,కబీర్, తదితరులు పాల్గొన్నారు. మసీద్ అధ్యక్షులు జనాబ్ అదిల్ మాట్లాడుతూ ఈ పోటీలలో ఇరుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో విజేతలుగా గెలిచారని తెలిపారు.అనేక ధార్మిక విషయాలను అదిల్ వివరించారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

– విప్ కార్యాలయంలో వినతి పత్రం



**నర్సాపురం, మేజర్ న్యూస్ :** రానున్న బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏ.పి.జి ఇ.ఎ) పశ్చిమ గోదావరి జిల్లా ప్రతినిధులు ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ అసెంబ్లీ సమావేశాల కారణంగా అందుబాటులో లేకపోవడంతో వారి ప్రతినిధులకు క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు.ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, ఐ.ఆర్ ,వేతన సవరణ కమిషన్ ఏర్పాటు, సి.పి.ఎస్. రద్దు – ఓ.పి.ఎస్ పునరుద్ధరణ మొదలైన అంశాలు ఈ బడ్జెట్ లో ప్రవేశపెట్టి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎం. లక్ష్మీ నారాయణ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ పులఖండం వాసు, నర్సాపురం తాలూకా ప్రెసిడెంట్ చిరంజీవి సతీష్, అసోసియేట్ ప్రెసిడెంట్ పి. రవి ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ శ్రీకృష్ణ వంశీ,ఈసీ మెంబెర్స్ కె.లక్ష్మణ్, ఎం.నరేష్,బి.రవి తదితరులు పాల్గొన్నారు.

# వెట్టి చాకిరి నిర్మూలన చట్టంపై అవగాహన కల్పించాలి



– జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం,మేజర్ న్యూస్ :** వెట్టి చాకిరి వ్యవస్థ నిర్మూలనకు 50 సంవత్సరాలు పూర్తయి సందర్భంలో దేశవ్యాప్తంగా జరుపుకుంటున్న స్వర్ణోత్సవ ఉత్సవాలలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో 50 సంవత్సరాల స్వర్ణోత్సవ వేడుకలు గోడ పత్రికను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ వెట్టిచాకిరి వ్యవస్థ అనేది సామాజిక అన్యాయానికి ప్రతిగా నిలిచిందని ఇటువంటి దురాచారాలను నిర్మూలించేందుకు ప్రభుత్వం గత ఐదు దశాబ్దాలుగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. 1976 సంవత్సరంలో వెట్టి చాకిరి నిర్మూలన చట్టం అమల్లోకి రావడం జరిగిందన్నారు. ఎక్కడైనా పెట్టి చాకిరీ లేదా బలవంతపు శ్రమ జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా విడుదల చేసిన గోడ పత్రిక ద్వారా వెట్టి చాకిరి నిర్మూలన చట్టపరమైన చర్యలు ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా సమాజంలో చైతన్యం పెంచి మానవ హక్కుల పరిరక్షణకు దోహదపడతాయని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు పై విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంలో జిల్లా కార్మిక శాఖ అధికారి డా.ఆకన లక్ష్మి, క్రాప్ డిస్టిక్ కో ఆర్డినేటర్ ఎస్.శ్రీను, డిపిఎం విజ్ఞాన కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, తదితర అధికారులు ఉన్నారు.

# కార్మిక సంఘాల భారీ మోటార్ సైకిల్ ర్యాలీ



**– 12వ తేదీ దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని పిలుపు**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఈనెల 12 తేదీన కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని ఎ.ఐ.టి.యు.సి., ఐ.ఎఫ్.టి.యు సంఘాల ఆధ్వర్యంలో నగరంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని కోరుతూ ఈనెల 12వ తేదీన కార్మిక సంఘాల ఆధ్వర్యాన నిర్వహించబోయే దేశవ్యాప్త సమ్మె జయప్రదానికై ఎ.ఐ.టి.యు. సి,ఐ.ఎఫ్.టి.యు అనుబంధ సంఘాల కార్మికులు వందలాది మందితో మున్సిపల్ ఆఫీసు వద్ద నుండి మోటార్ సైకిల్ ర్యాలీ ప్రారంభమై చందన బ్రదర్స్, ఎన్.ఎస్ మార్కెట్, వై.ఎం.హెచ్.ఏ. హాలు, పేరయ్య కోనేరు, పెద్ద పోస్ట్ ఆఫీస్, గడియారపు స్తంభం, మెయిన్ బజార్, పాత బస్టాండు, కర్రవంతన, స్టేషన్ రోడ్డు, పవర్ పేట రైల్వే స్టేషన్, ఆర్.ఆర్ పేట,ప్రభుత్వ ఆసుపత్రి, ఫైర్ స్టేషన్ సెంటర్ మీదుగా జూట్ మిల్ వరకు భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. 12వతేదీదేశవ్యాప్తసమ్మెను జయప్రదం చేయాలని,ప్రధాని నరేంద్ర మోడీ కార్మిక వ్యతిరేక విధానాలను నశించాలని, ప్రైవేటీకరణ విధానాలు నశించాలని, ఉద్యోగ, కార్మిక సంఘాల ఐక్యత వర్ధిల్లాలని, పెద్ద ఎత్తున నినదించారు.ఐ.ఎఫ్.టి.యు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేస్తూ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మికులకు ఉరి తాళ్ల లాంటివని, వీటిని తక్షణమే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఎ.ఐ.టి.యు.సి నాయకులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తీసుకురావడమే కాకుండా మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధీ హామీ చట్టాన్ని రద్దుచేసి జిరాంజీ పథకం తీసుకురావడం గ్రామీణ పేదలను కూడా మోసగించడమే అని దుయ్యబట్టారు.

ఈ కార్యక్రమానికి ఐ.ఎఫ్.టి.యు నగరఅధ్యక్ష, కార్యదర్శు లు బి. సోమయ్య, యర్రా శ్రీనివాసరావు, ఎ.ఐ.టి.యు.సి నాయకులు పి.కన్నబాబు.అప్పలరాజు,కడుపు కన్నయ్య, పి.కిశోరు,బాలభాస్కరరావు, కనకదుర్గారావు,బాలాజీ,శంకర్,నారాయణరావు, ఐఎఫ్టియు నాయకులు ఎన్. నెహ్రూ బాబు, ఎల్.సత్యనారాయణ, కాకర్ల శ్రీను, చంద్రశేఖరు, కుమార్ రాజు,మున్సిపల్ యూనియన్ నాయకులు బాలు,బంగారు వెంకటేశ్వర రావు,బండి రాజు,పీ.చిన్ననాగరాజు,పి. సారయ్య,కాళిదాసు, శ్రీను,ఎ.గంగాధర్, సామ్రాజ్యం, చంద్రావతి, అమ్మాజీ, ఎం.దుర్గ ,ఆంథోనీ, మీసాల రమణ, ఎస్, సూరిబాబు,దన్నాన విజయ్, డి. వీర నాయుడు, ఎం. అప్పారావు, ధర్మా, తీయ్యాల నీలయ్య ,పి.త్రినాథ్. ఆర్. పాపారావు, ఏ రాంబాబు, బి. రాములమ్మ,కె.విజయలక్ష్మి, ఆంథోని పాల్,పి. ప్రసాదు తదితరులు నాయకత్వహించారు.

## మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

**– ఎమ్మెల్సీ గోపి మూర్తి**



**నరసాపురం రూరల్, మేజర్ న్యూస్ :** విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్సీ గోపి మూర్తి అన్నారు. సోమవారం మండలంలోని సీతారాం పురంలో గల స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ర్యాగింగ్ వ్యతిరేకత, మాదకద్రవ్యాల వ్యతిరేకత పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల టీచర్ శాసనమండలసభ్యులు బొర్రా గోపి మూర్తి పాల్గొన్నారు. విద్యార్థులు ఎలాంటి మత్తు పదార్థాలు లోబడకుండా తల్లిదండ్రులకు అలాగే కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చే విధంగా ఉండాలని ఆయన సూచించారు. మత్తు పదార్థాల వల్ల జీవితం అంధకారం అవుతుందని, కష్టపడి నాలుగు ఏళ్ళు ఇంజనీరింగ్ పూర్తి చేస్తే అత్యున్నత శిఖరాలు అధిరోహించవచ్చునని గోపి మూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో నరసాపురం రూరల్ సీఐ జి దుర్గాప్రసాద్, మొగల్తూరు ఎస్సై వై నాగలక్ష్మి, కళాశాల చైర్మన్ కొండవీటి సత్యనారాయణ, కోశాధికారి కొండవీటి వెంకటేశ్వర స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, కళాశాల మేనేజ్మెంట్ సభ్యులు టీ వి.వి ప్రసాద్, ఎస్ కీర్తి కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ గోపీచంద్,కళాశాల విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 12 జరిగే సమ్మె విజయవంతం చేయాలి



**భీమడోలు,మేజర్ న్యూస్ :** కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్ లను వ్యతిరేకిస్తూ ఈనెల 12వ తేదీన నిర్వహించే దేశ వ్యాప్త సమ్మె విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్. లింగరాజు కోరారు. ఈ మేరకు నిర్వహించిన ప్రచార జీపు యాత్ర సోమవారం భీమడోలు మండలంలో పర్యటించింది.పూళ్ళ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా.ఆర్. లింగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 8 గంటల పని హక్కుకు రక్షణ కల్పించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయరాదని, స్కీం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించాలని, కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, సిఐటియు మండల కన్వీనర్ కె. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలు, పోక్సో చట్టం, మాదకద్రవ్యాలపై అవగాహన



**ఆగిరిపల్లి,మేజర్ న్యూస్:** సైబర్ నేరాలు, పోక్సో యాక్ట్, మాదకద్రవ్యాల వాడకంపై వలన కలుగు దుష్పరిణామలపై ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్ సోమవారం స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భముగా ఎస్ఐ పోస్కో యాక్ట్ సోషల్ మీడియా ఫ్రాడ్ లు క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్, డయల్ 112 పై వివరించారు.ఎస్ఐ విద్యార్థిని,విద్యార్థులతో మాట్లాడుతూ సైబర్ నేరాలు, మహిళల, మైనర్ బాలికల చట్టాలను గురించి,మాదక ద్రవ్యాలను వినియోగిం చిన, కలిగి వున్న విక్రయించిన, రవాణా చేసిన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫేస్బుక్, ట్విట్టర్ వంటి సోషల్ నెట్వర్క్ ను, జీ మెయిల్ను అవసరం మేరకు వాడాలని, ఫొటోలు, వ్యక్తిగత సమాచారం పోస్ట్ చేయవద్దని,ఇంటర్నెట్ సమాచార సేకరణకు మాత్రమే ఉపయోగిం చుకోవాలని, సోషల్ మీడియా మధ్యమలలో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకోకూ డదని,సోషల్ మీడియా మాధ్యమాలలో వచ్చి లింకులను గాని,మెసేజ్లను గాని,యాప్ ను గాని, తెలియని వారు పంపించినటు వంటివి ఓపెన్ చేస్తే మీ గోప్యమైనటు వంటి సమాచారం తస్కరిస్తారని పేర్కొన్నారు. బ్యాంక్ అధికారులు ఇవన్నీ లేదా ఇతర అధికారు లు మని చెప్పి మీ యొక్క ఓ.టీ.పీ ని అడిగిన ఎడల మీరు అధికారులు వివరాలను తెలుసు కున్న తర్వాత మాత్రమే తెలియచేయాలని,లేకపోతే ఓటీపీ చెప్పిన వెంటనే మీ బ్యాంకు లోను ఉన్న అమౌంట్ లు సైబర్ నేరగాళ్లు దొంగిలిస్తారని తెలిపారు. డయల్ 112 తెలియ చేసిన వారి సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ శుభ శేఖర్ అన్నారు.

## 12న దేశ వ్యాప్త సమ్మె జయప్రదం చేయాలి



**ఏలూరు,మేజర్ న్యూస్ :** కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు రద్దు చేయాలని ఈనెల 12వ తేదీన జరుగుతున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఐ.ఎఫ్.టి.యు అనుబంధ ఏలూరు మార్కెట్ యార్డు హమాలి వర్కర్స్ యూనియన్ కమిటీ సమావేశం విజ్ఞప్తి చేసింది. మార్కెట్ యార్డు హమాలీ వర్కర్స్ యూనియన్ కమిటీ సమావేశం యర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన స్థానిక మార్కెట్ యార్డ్ హామాలి వర్కర్స్ యూనియన్ ఆఫీసులో నేడు జరిగింది. ఈ సమావేశంలో ఐ.ఎఫ్.టి.యు ఏలూరు నగర అధ్యక్షులు బి.సోమయ్య పాల్గొని మాట్లాడుతూ కార్మికవర్గం అనేక పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి వాటి స్థానంలో లేబర్ కోడ్లు తీసుకురావడం దుర్మార్గమని అన్నారు.యార్డ్ హమాలి వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డి అప్పల నాయుడు, ఐ.ఎఫ్.టి.యు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు,విజయ్ తదితరులు మాట్లాడారు. ఈనెల 12వ తేదీ జరిగే దేశవ్యాప్త సమ్మెలో మార్కెట్ యార్డు హమాలీ వర్కర్స్,రిక్షా పుల్లర్స్,మోత కార్మికులు, గ్రేడింగ్ కార్మికులు అన్ని విభాగాలకు చెందిన కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొవాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో మీసాల వెంకటరమణ, కోరాడ అప్పారావు, సింహాచలం, డేవిడ్, పండు తదితరులు పాల్గొన్నారు. సమావేశం వివరాలను ఐ.ఎఫ్.టి.యు నగర కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు పత్రికలకు తెలియజేశారు.

## కరెంటు రీడింగ్ తియ్యరు - వినియోగదారుడి జేబుకు చిల్లు



**పాలకొల్లు, మేజర్ న్యూస్:** విద్యుత్ చార్జీలు ఆకాశాన్ని అం టుతున్నాయి సర్జాజీలని ఏవేవో నా కాల తో వినియోగదారుడి నుండి సొమ్ము గుంజుతున్నారు, ఏ ప్రభుత్వం వచ్చినా కరెంటు చార్జీలు పెంపు సర్వసాధారణంగా మారాయి, ప్రతి నెల కాంట్రాక్టర్ రీడింగ్ తీసే పద్ధతిలో చాలా తేడాలు ఉన్నాయి, నెల చివరి తేదీ 31 అయినప్పటికీ ఫిబ్రవరి నెల 9వ తారీకు వచ్చిన రీడింగ్ తీయకపోవడంతో వినియోగదారుడు యూనిట్లు పెరిగే కొద్దీ రేట్లు పెరుగుతూ ఉంటాయి యూనిట్కు రెండు రూపాయలు కట్టవలసిన దానికి ఐదు రూపాయలు ఏడు రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితి ఈ తప్పు ఎవరిది కాంట్రాక్టర్లు సమ్మె చేస్తే విద్యుత్ అధికారులు దీనిపై కనీసం ప్రత్యామ్నాయ మార్గాన్ని అన్వేషించకుండా వినియోగదారిది జేబుకు చిల్లుపడే విధంగా నిముఖ నీడ ఎత్తినట్లు ఉన్నారని వినియోగదారులు వాపోతున్నారు,

## శ్రీ క్షీర రామలింగేశ్వర స్వామి ఆయంలో ఏడు సప్త ప్రదక్షిణాలతో పూజలు



**పాలకొల్లు, మేజర్ న్యూస్:** పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ క్షీర రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం నందు సోమవారం సాయంత్రం ఐదు గంటల 30నిలకు ఏడు మారేడు దళములతో ఏడు సప్త ప్రదక్షిణాలలో పాల్గొన్న భక్తుల సంఖ్య సుమారు 250 మంది శ్రీ స్వామివారిని దర్శించి భక్తిశ్రద్ధలతో పూజలు గావించారు. తదుపరి ఏడు గంటలకు శ్రీ స్వామివారి దూబ సేవ రాత్రి 7 గంటల 30 నిమిషాలకు శ్రీ స్వామివారి పంచ హారతులు సేవ జరిగింది. కార్య నిర్వహణనాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు. పై కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మీసాలు రామచంద్రరావు ధర్మకర్తలు పాల్గొన్నారు,

# హాస్టల్ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు నిలిపివేయాలి




**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్ :** హాస్టల్ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు నిలిపివేయాలని, హాస్టల్ స్థలములో హాస్టల్ మాత్రమే కట్టాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కాకి నాని ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి విద్యార్థులతో కలిసి సోమవారం ర్యాలీగా హాస్టల్ స్థలనికి చేరుకునీ నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎమ్మార్వో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆర్ ఐ కే.గంగరాజు కి అందజేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ఎస్టి హాస్టల్ స్థానంలో హాస్టల్ బిల్డింగులు కట్టకుండా ఐటీడీఏ అధికారులు షాపింగ్ కాంప్లెక్స్ భవనాలు నిర్మాణం చేయడం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. కళాశాలకు దగ్గరగా ఉన్న హాస్టల్ ను మూడు నాలుగు కిలోమీటర్లు దూరం లో కడితే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును పక్కన పెట్టి వ్యాపారం చేసి డబ్బులు దండుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారని ఆరోపించారు.జిల్లా ప్రధాన కార్యదర్శి బన్నె వినోద్ మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలకు వెళ్లడానికి దగ్గరగా అందుబాటులో ఉన్న హాస్టల్ ను వేరొక చోట కట్టడం వలన ఇంటర్ ఐటిఐ డిగ్రీ విద్యార్థులు కళాశాలలకు నడిచి వెళ్లలేక మధ్యలో మానేసే పరిస్థితి ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. గిరిజన విద్యార్థులకు ఐటీడీఏ అధికారులు తీవ్ర అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఉన్నతాధికారులు స్పందించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు నిలిపివేయాలని,హాస్టల్ స్థలములో హాస్టల్ మాత్రమే కట్టాలని కోరుతున్నారు.

ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. రామ్మోహన్, న్యాయవాది, భాషా శ్యాం బాబు, సిహెచ్ దుర్గ ప్రసాద్, ఎన్. సీతారాం, జి.తేజ, కే.జంపన్న,జి. లచ్చిరెడ్డి, కే. దానియేలు, ఎం.మనోజ్, టి. రామ్ చరణ్, ఎం. యువరాజ్, టి. మోహన్, కె.నరేంద్ర, కే. కన్నయ్య తదితరు విద్యార్థులు పాల్గొన్నారు.

## చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి : ఎస్ఐ జానా సతీష్



**ఇరగవరం,మేజర్ న్యూస్ :** భారత రాజ్యాంగ చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని ఇరగవరం సబ్ ఇన్స్పెక్టర్ జానా సతీష్ అన్నారు. పల్లెనిద్ర కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మండలంలోని కావలిపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అయన మాట్లాడారు. ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని తెలిపారు.వీటిపై అసరియైన అవగాహన పెంచుకుని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరల్లో అధికంగా ఆర్థికపరమైన కేసులే ఎక్కువయ్యాయని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తుల సంచారం పై ప్రజలు నిఘా వేసి పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. మహిళలు,చిన్న పిల్లలపై అఘాయిత్సలు జరుగుతున్నా నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లల కదలికలపై భాధ్యతగా వ్యవహారించాలని సూచించారు. పిల్లలనుండి వృద్ధులవరకు మద్యం, పాన్, గుట్కా, ఖైని వంటి మాదక ద్రవ్యలకు బానిసలుతున్నారని అన్నారు. దీనివల్ల ఆర్థికంగా బలహీనపడటమే కాకుండా అనారోగ్యం పాడవుతుందని తెలిపారు. ఇటువంటి అలవాట్లు మంచిదికాదని అన్నారు. గ్రామాల్లో జరిగే ఘర్షణలు, తదితర నేరాలు అదుపునకు ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు.చట్టలపై సరియైన అవగాహన పెంచుకోవడం వలన నేరాలు తగ్గుతాయని అన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## మట్టితో నిండిపోయిన మంచినీరు - చెరువులో మట్టి తవ్వాలి



**ఉంగుటూరు,మేజర్ న్యూస్ :** ఉంగుటూరు మండలం ఉప్పాకపాడులో మంచినీటి చెరువు(కోనేరు చెరువు) ఎన్నో సంవత్సరాల నుంచి బంక మట్టితో నిండి పోయిందని ఎంపిటీసీ ఇంటి మంగరాజు అధికారులకు వివరించారు. సోమవారం ఆయన ఉంగుటూరులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సూపరిడెంట్ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు.చెరువును తవ్వి ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించాలని కోరారు.

# ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు ప్రయోజనం

**– సొసైటీ అధ్యక్షులు మోరంపూడి శ్రీనివాస్‌రావు**



**చాట్రాయి, మేజర్ న్యూస్,** ఉచిత వైద్య శిబిరాలు నిరుపేద ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటాయని సొసైటీ అధ్యక్షులు మోరంపూడి శ్రీనివాస్‌రావు అన్నారు. విస్సన్నపేట, సనుబండ సత్య సాయి ట్రస్ట్ మరియు భజన మండలి ఆధ్వర్యంలో నూజివీడు అమెరికన్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మోరంపూడి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటి జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ శిబిరంలో 109 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 50 మందికి కంటి ఆపరేషన్లు అవసరమైనట్లు తెలిపారు. అవసరమైన వారికి మందులు ఇచ్చినట్లు వైద్య బృందం వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి ట్రస్ట్ సభ్యులు జగ్గవరపు రంగారెడ్డి, కుక్కడపు చక్రధర్ రావు, సత్య సాయి భజన మండలి సభ్యులు వనమా ప్రవీణ్, కొక్కెరపాటి లక్ష్మణ రావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# 12న జరిగే దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలి



**పెదవేగి,మేజర్ న్యూస్:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ కార్మిక కర్షక వ్యతిరేక విధానాలపై ఫిబ్రవరి 12వ తేదీ జరిగే సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొవలనీ సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ లింగరాజు పిలుపు నిచ్చారు. సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రచార జాత పెదవేగి మండలం దెందులూరు మార్కెట్ యార్డు దగ్గర పెదవేగి గ్రామం గోదావరి గ్రామీణ బ్యాంకు సెంటర్లలో ప్రచార జాత జరిగింది .కార్మికులను ఉద్యోగులను కలిసి 12వ తేదీ సమ్మెలో పాల్గొనాలని ప్రచారం నిర్వహించారు .

నాలుగు లేబర్ కోడ్లురద్దు ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని రైతు వ్యతిరేక విధానాలు విడనాడాలని నినాదాలు చేశారు .ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తూ శ్రామిక వర్గాలను దోపిడీకి గురి చేస్తుందని విమర్శించారు.

సిఐటియు మండల కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగవంతమైన చర్యలు తీసుకోవాలని కోరారు మార్కెట్ యార్డ్ అధ్యక్షులు బి సుబ్బారావు పి రమేష్ అంగన్వాడీ టీచర్స్ టి.కృష్ణవేణి అనురాధ మల్లిక ఆశా వర్కర్స్ ఎ.వల్లి ఎన్. తులసి కార్మికులు పాల్గొన్నారు.

## మార్చి 14న జాతీయ లోక్ అదాలత్



**భీమడోలు,మేజర్ న్యూస్ :** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల ప్రకారం భీమడోలు కోర్టు పరిధిలోని అనగా దెందులూరు, భీమడోలు,ద్వారకాతిరుమల మండలాలకు సంబంధించిన కేసుల పరిష్కారం నిమిత్తం మార్చి 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహిస్తున్నామని భీమడోలు మండలి లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్పర్సన్ , సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) యస్ ప్రియదర్శిని నూతక్కి ఒక ప్రకటనలో తెలియజేశారు.భీమడోలు మండలి లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్ పర్సన్ ఎస్.ప్రియదర్శిని నూతక్కి మాట్లాడుతూ రాజీ యోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు,సివిల్ దావాలు,కుటుంబ వివాదాలు, చెక్ బౌన్స్ కేసులు కేసులు, చిట్ , ఫైనాన్స్ కు సంబంధించిన కేసులు,టెలిఫోన్ బకాయిలు, పంచాయతీ పరిధిలోని ఇంటి ,నీటి పన్ను వివాదాలు ఈ జాతీయ లోక్ అదాలత్ నందు పరిష్కరించడం జరుగుతుందని,లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకోబడిన సివిల్ కేసులలోని కోర్టు ఫీజును తిరిగి చెల్లించబడుతుంది, కావున కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని డబ్బు సమయాన్ని ఆదా చేసుకోవాలని సూచించారు. కేసులు పరిష్కారంలో సమస్యలు ఉన్న న్యాయవాది ద్వారా గాని నేరుగా గాని లేదా15100 ను అన్ని పని వేళలలో సంప్రదించవచ్చని తెలియజేశారు. ఈ అవకాశాన్ని వినియోగించు కొని కేసుల నుండి విముక్తి పొందాలని సూచించారు.

## తంగెళ్ళమూడి గంగమ్మ జాతరకు పోలీసుల భారీ బందోబస్తు

**– డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో 2 టౌన్ సిఐ అశోక్ కుమార్ పర్యవేక్షణ**




**ఏలూరు,మేజర్ న్యూస్ :** తంగెళ్ళమూడి గంగమ్మ జాతర ముగింపు సందర్భంగా కొర్ల బండి ఊరేగింపు పురస్కరించుకొని భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, జిల్లా పోలీసు యంత్రాంగం పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ భద్రతా ఏర్పాట్లను డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ స్వయంగా క్షేత్రస్థాయిలో ఉండి పర్యవేక్షించారు. 2-టౌన్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందిని వివిధ బృందాలుగా విభజించి, ఊరేగింపు సాగే మార్గాల్లో మోహరించారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ క్రమ బద్ధీకరణ, జనసందోహ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించారు.ఊరేగింపు ప్రశాంతంగా సాగేలా సీసీ కెమెరాలు ,డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా ఉంచుతూ, ఎప్పటికప్పుడు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. జాతర ముగింపు వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని,పోలీసు వారు అందిస్తున్న సూచనలను పాటించి బందో బస్తుకు సహకరించ వలసిందిగా అధికారులు కోరారు.

## సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపీడీవో మనోజ్



**ఉంగుటూరు,మేజర్ న్యూస్ :** ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందే విధంగా కృషిచేయాలని ముఖ్య మంత్రిచంద్రబాబు నాయుడు అధికారులకు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం లో మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శిలు సీఎం సమీక్ష సోమవారం నిర్వహించారు. ఉంగుటూరు మండల పరిషత్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో ఎంపీడీవో జి ఆర్ మనోజ్, డిప్యూటీ ఎంపీడీవో టి ముత్తయ్య ఇతర మండల స్థాయి శాఖ అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు.

# ఏలూరులో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

– రహదారులు,అనుసంధాన వంతెనల నిర్మాణానికి యుద్ధప్రాతిపదికన చర్యలు
– వంతెన నిర్మాణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే బడేటి చంటి




**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఏలూరు నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేకదృష్టిసారించామని తెలుగుదేశంపార్టీజిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. దానిలో భాగంగానే రహదారులు, అనుసంధాన వంతెనలనిర్మాణానికి,అభివృద్ధికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామని,దాంతో పాటుగా వివిధశాఖల అధికారులను సమన్వయ పరుస్తూ, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని ఆయన వెల్లడించారు. రామకృష్ణాపురం మినీబైపాస్ రోడ్డు నుండి వంగాయగూడెం రోడ్డుకు అనుసంధానంగా కృష్ణకాలువపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను కూటమి నాయకులతో కలిసి టిడిపి జిల్లా అధ్యక్షులు,ఎమ్మెల్యే బడేటి చంటి స్వయంగా పరిశీలించారు. ఇప్పటికే పూర్తైన ఫిల్లర్లు, రివిట్‌మెంట్ వాల్ పనులను పరిశీలించారు. అధికారులను అడిగి బ్రిడ్జి నిర్మాణ పురోగతిపై పలు వివరాలను తెలుసుకున్నారు. ప్రధానంగా రోడ్డు వెడల్పు చేసేందుకు తలెత్తుతోన్న సమస్యలు తన దృష్టికి రావడంతో ఆ దిశగా ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు వెడల్పు చేసేందుకు పంపుల చెరువు నీటిగొట్టాలు రోడ్డుభాగంలో ఉండడంతో ప్రజలకు ఏఇబ్బందులు తలెత్తకుండా కార్పొరేషన్, ఆర్‌అండ్‌బి అధికారులు సమన్వయంతో పనిచేసిచ సమస్యను పరిష్కరించాలని అక్కడికక్కడే కీలక సూచనలు చేశారు. మరోపక్క వంతెన ఎత్తుకు అనుగుణంగా విద్యుత్‌స్తంభాలను ఎత్తుకు పెంచాల్సిన అవసరం ఉందని,ఆ సమస్యను పరిష్కరించాలంటూ ట్రాన్స్‌కో ఈఈ కెఎం అంబేద్కర్‌ను ఆదేశించారు. ఇదేక్రమంలో శ్లాబ్ నిర్మాణాన్ని కూడాత్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ మార్చి నెలాఖరు నాటికి బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేసే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. ఆర్టీసి విజయవాడ జోన్–2 రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తోన్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలు ప్రజల్లోకి వెళ్ళకూడదనే దుర్బుద్ధితోనే వైసిపి నాయకులు దుష్ప్రచారాలకు పూనుకున్నారంటూ విమర్శించారు.

కార్యక్రమంలో ఏపి మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు,ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్,డిప్యూటీ మేయర్ కర్రి శ్రీనివాస్,కో–ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్ఎమ్మార్ పెదబాబు, పాము శామ్యూల్, పిఎన్ఆర్ నాగేశ్వరరావు,కప్ప ఉమామహేశ్వరరావు, వీరంకి త్రినాథ్ , బెల్లపుకొండ కిషోర్, ఆర్ఎన్ఆర్ రాజేశ్వరరావు,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# ఖ్యాతిని తెచ్చిపెట్టిన 'మా ఊరి తంగేడు పూలు'



– రచయిత్రి కొంకేపూడి అనురాధ సంతోషం

**విజయనగరం / కామవరపుకోట,మేజర్ న్యూస్ :** కామవరపుకోట చరిత్రను తెలియజేస్తూ రాసిన 'మా ఊరి తంగేడు పూలు' పుస్తకం ఖ్యాతిని తెచ్చి పెట్టిందని ప్రముఖ రచయిత్రి కొంకేపూడి అనురాధ సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో 'మా ఊరి తంగేడు పూలు' రచనకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డును సాధించటం గర్వంగా ఉందని ఆమె పేర్కొన్నారు. తాను రచించిన రచనల ద్వారా గుర్తింపురావడం తాను పుట్టిన ఊరు చరిత్ర రాసేందుకు సహకరించిన గ్రామస్తులకు, ప్రోత్సహించిన తన భర్త ప్రసాద్ కు కృతజ్ఞతలు తెలిపారు. విజయనగరంలో రచయిత్రి అనురాధ ఇంటి వద్ద కామవరపుకోటకు చెందిన సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ చైర్మన్ వీరమల్ల మధు కుటుంబ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి ఆమె సంపుటిని అందజేశారు. అనురాధ మా ఊరి తంగేడు పూలు పుస్తక రచనతో పాటు పండగ పాటలు వేడుక పాటలు, పెళ్లి పాటలు,మహతి వచన కవితా సంపుటి,నిత్యమల్లె కథాసంపుటి,కావిలిపాటి జయలక్ష్మి మోనోగ్రఫీ,శాకాంబరీ ప్రసాదం వంటలు,సన్నాన పత్రాలు పాటల పందిరి పుస్తకాలు రచించినట్లు తెలిపారు. ఈ రచనలలో మహతి రచనకు గ్రంథాలయాల అనుమతి లభించటం,మహతి పుస్తకాన్ని పోరంకి నాగరాజు,నిత్యమల్లె పుస్తకాన్ని ఇనుగంటి జానకి హిందీలోకి అనువదించటం ఆత్మ తృప్తిని కలిగించిందన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు మన విలువలు సంస్కార విద్య,నామ రామాయణం గోష్ఠి గానం,శతాధిక విద్యార్థులతో గళార్చన కార్యక్రమాన్ని సైతం చేయటంతో పాటు విశాఖపట్నం రేడియో ద్వారా తన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సాంప్రదాయ వాణి వినిపించడం జరుగుతుందన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా, రచనల ద్వారా చైతన్య పరచటం తన ధ్యేయమని అనురాధ మనసులో మాట చెప్పారు.

# వెలగని విద్యుత్ దీపాలు !

– సిగ్నల్ ,హెచ్చరిక బోర్డులు లేక డివైడర్‌ను గుర్తించడం ఎలా ?

**కొయ్యలగూడెం రూరల్,మేజర్ న్యూస్ :** కొయ్యలగూడెం మండలం కేంద్రం లో నేషనల్ హైవే రోడ్డు అథారిటీ అధికారులు ఊరు శివ (టీటీడీ కల్యాణ మండపం వద్ద నుండి కొవ్వూరు రోడ్డు గ్రామ శివారు ఎస్సార్ పెట్రోల్ బంక్) వరకు రోడ్డుకి ఇరువైపులా ఏర్పాటు చేసినటువంటి విద్యుత్ దీపాలు రాత్రి వేళల్లో వెలగకపోవడంతో బస్టాండ్ వద్ద నుండి చీకటిగా ఉండి అంధకారాన్ని తలపిస్తున్నదని స్థానిక ప్రజలు తెలుపుతున్నారు. గణపతి సెంటర్ వద్ద నుండి కొవ్వూరు రోడ్డుకు మార్గంలో ఉన్న డివైడర్ దీపాలు వెలగక కనిపించకపోవడంతో చిన్నచిన్న వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నామని అంటున్నారు. రాత్రి వేళల్లో వాహనాల వెలుతురు తప్ప విద్యుత్ దీపాలు వెలుతురు లేకపోవడం ప్రమాదాలకు ప్రధాన కారణంగా తెలుపుతున్నారు. కొవ్వూరు మార్గం నుండి వస్తే చీకటిగా ఉండటంవల్ల డివైడర్ దగ్గరికి వస్తేనే కానీ డివైడరు ఉందో లేదో తెలియడం లేదని ప్రమాదానికి గురైన వారు తెలుపుతున్నారు. కనీసం డివైడర్ మీద ఎటువంటి హెచ్చరిక బోర్డులు, కానీ గుర్తులు ,సిగ్నల్ లైట్లు,లేకపోవడం తో డివైడర్ గుర్తించడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. గణపతి సెంటర్ వద్ద నుండి సూర్య లాడ్జి,బస్టాండ్,వరకు విద్యుత్ కాంతులు వెలగడంతో డివైడర్ను గుర్తించవచ్చునని ప్రయాణికులు చెబుతున్నారు .ఎస్సీ పేట నుండి రాత్రి వేళల్లో సెంటర్ వద్దకు రావాలన్న భయానకంగా ఉంటుందని పేట ప్రజలు తెలుపుతున్నారు. బస్టాండ్ వద్ద తుప్పలు ,మురుగునీరు చేరి అపరిశుభ్రత వాతావరణం ఉండడంతో బురద పాములు రోడ్లపై సంచరిస్తు కాళ్ల మధ్యలో పడుతున్నాయని విద్యుత్ కాంతులు లేకపోవడంతో పాములను గుర్తించలేకపోతున్నామని బాధితులు చెబుతున్నారు. ఇకనైనా పంచాయితీ అధికారులు,పోలీస్ శాఖ , ఎన్హెచ్ రోడ్డు అథారిటీ,వారు స్పందించి విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు వాహన చోదకులు కోరుతున్నారు.

# భారతీయ సంస్కృతి నేర్పించాలి : ఎమ్మెల్యే బొలిశెట్టి



**పిఠాపురం / తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్;** బాల్యం నుంచే భారతీయ సంస్కృతి ఔన్నత్యాన్ని బోధించాలని ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో శ్రీ విశ్వ విజ్ఞాన విద్య, ఆధ్యాత్మిక పీఠం 98 వ వార్షిక మహాసభలలో సోమవారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. డా. ఉమర్ అలీషా ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిఠాపురంలో ఆధ్యాత్మిక పీఠాలు హిందూ ధర్మానికి దోహదపడుతున్నాయని, రాష్ట్రంలో హిందూ మతానికి గురువులు, పీఠాధిపతులు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నారని అన్నారు. ఉమర్ అలీషా ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ఆకాంక్షించారు. పిల్లలకు చిన్ననాటి నుండే మన దేశ సంస్కృతి బోధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం జనసేన పార్టీ నాయకులు కాకినాడ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ప్రభాకర్(బాబి) పుల్లా బాబి,చాపల రమేష్,మద్దాల మణికుమార్, అడ్డగర్ల సూరి, గట్టెం నాని, పిడుగు రామ్మోహన్ బ్రదర్స్, సిద్ద వీర్రాజు, మలపాక చిట్టి, నల్లగంచి రాంబాబు, బైన పాలెపు ముఖేష్, దారపురెడ్డి శ్రీనివాస్, ఉడత బాలాజీ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## బలుసులమ్మ జాతరకు రూ.5 లక్షలు విరాళం

– అందజేసిన వాసవి యాజమాన్యం



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్;** బలుసులమ్మ వారి జాతరకు పెదతాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం రూ.5 లక్షల భారీ విరాళం అంద జేశారు. కళాశాల అధ్యక్షులు గ్రంధి సత్యనారాయణ బృందం ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్‌ను ఆయన కార్యాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ రంగం అంజిబాబుకు విరాళం సొమ్మును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014లో జాతర నిర్వహించామని, అమ్మవారి దయతో మళ్ళీ ఇప్పుడు జాతర నిర్వహించే అవకాశం వచ్చిందని అన్నారు. బలుసులమ్మ ఆశీస్సులతో తాడేపల్లిగూడెం ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలనే సత్సంకల్పంతో ఈ జాతర మహోత్సవం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వాసవి ఇంజనీరింగ్ కాలేజ్ యాజమాన్యం, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురికి జరిమానా



**నరసాపురం,మేజర్ న్యూస్ :** పట్టణంలో మద్యం తాగి వాహనం నడిపిన నలుగురు వ్యక్తులకు కోర్టు భారీ జరిమానా విధించింది. ఆదివారం మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు దొరికారు. నిందితులకు సోమవారం నరసాపురం సెకండ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎన్. శంకర్ ఎదుట హాజరుపరచగా, ఆయన ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున నలుగురికి రూ.40వేలు అపరాధ రుసుం విధించినట్లు టౌన్ సీఐ బి.యాదగిరి తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేస్తామని ఆయన హెచ్చరించారు.